మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



### భూ సమస్యల సత్వర పరిష్కారానికై

# రెవెన్యూ సదస్సులు

### కలెక్టర్ విజయేందిర బోయి



రైతువేదిక సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ (మూసాపేట్), మే 6 :** భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ మూసాపేట్ మండలం లో రెవెన్యూ సదస్సులో భాగంగా మంగళవారం జానంపేట గ్రామం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో,వేముల గ్రామం రైతు వేదికలో నిర్వహించిన సదస్సులలో కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి పాల్గొన్నారు రిజిస్ట్రేషన్ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్ డెస్క్ తదితర వాటిని సందర్శించి, రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. సదస్సులతో రైతుల నుండి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా భూభారతి – మిగతా2లో..

### ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు

# స్థలాలపై ఆరా

### బాలానగర్‌లో రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ అనుకూరి మురళి పర్యటన



పాఠశాలల నిర్మాణానికి స్థలాలు పరిశీలిస్తున్న అనుకూరి మురళి బృందం

**బాలానగర్, మే 6 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ అనుకూరి మురళి బృందం మంగళవారం పర్యటించింది. జిల్లా విద్యాధికారి ప్రవీణ్ కుమార్, స్థానిక ఎంఈఓ శంకర్, ఏ ఎమ్ఓ శ్రీనివాస్ తదితరులతో విద్యా కమిషన్ చైర్మన్ బాలానగర్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, ఉడిత్యాల జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల, అలాగే పెద్దరేవల్లి గ్రామ ఉన్నత పాఠశాల స్థలాలను పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు అనువైన స్థలాన్ని స్థానిక అధికారులు, ప్రజలతో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి విద్యా కమిషన్ చైర్మన్ తీవ్రంగా కసరత్తు చేస్తుంది. ఈ నేపథ్యంలో బాలానగర్ మండలంలో పర్యటించిన విద్యా కమిషన్ చైర్మన్ బృందం జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

### నూనె గింజల

# ఉత్పత్తిని పెంచాలి

### నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, మే 6 ప్రభాతవార్త :** జిల్లాలో నూనె గింజల ఉత్పత్తిని పెంచాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ఎంఎంఈఓ అమలుపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మిషన్ ప్రధాన ఉద్దేశ్యం దేశీయంగా తినదగిన నూనె గింజల ఉత్పత్తిని ప్రోత్సహించడం ద్వారా దిగుమతులపై ఆధారాన్ని తగ్గించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ మాట్లాడుతూ మద్దూరు, దామరగిద్ద, మక్తల్ మండలాల్లో ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంఘాల –మిగతా2లో..

### పరువు పోయిందని

# పెళ్లి కొడుకు తండ్రి ఆత్మహత్య

### పెళ్లి జరగాల్సిన ఇంట్లో విషాదం



కాంజి గోవిందరావు (ఫైల్)

**నారాయణపేట టౌన్, మే 6 ప్రభాతవార్త :** రెండు రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉండగా పెళ్లి కూతురు ప్రియుడితో వెళ్లి పోవడంతో తమ పరువు పోయిందని మదన పడిన పెళ్లి కొడుకు తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కాంజి గోవిందరావు కుమారుడు అభిషేక్‌కు జ్ఞాని విజయ్ కుమార్ కూతురు శ్వేతతో పెళ్లి నిశ్చయం అయింది. 4 నెలల క్రితం అంగరంగ వైభవంగా ఎంగేజ్‌మెంట్ కార్యక్రమం జరిపారు. ఈ నెల 9న పెళ్లి ముహూర్తం నిశ్చయించి పెళ్లి పత్రికలు ముద్రించి బంధు మిత్రులకు పంచిపెట్టి పెళ్లికి ఆహ్వానించారు. అంతేకాకుండా పెళ్లి ఏర్పాట్లు లక్షలు ఖర్చు చేసి పూర్తి చేశారు. అయితే మంగళవారం పెళ్లి కుమారుడిని చేయాల్సి ఉండగా ఆదివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో –మిగతా2లో..

## అలంపూర్ అమ్మవారి సన్నిధిలో స్పీకర్



స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్. పి. శ్రీనివాసరావు,ఎమ్. ఎల్. ఏ. విజయుడు

**అలంపూర్ మే 6 ప్రభాతవార్త :** అష్టదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తి పీఠమైన శ్రీ జోగులాంబ దేవి, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను మంగళవారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రతేక పూజలు చేసారు అంతకుముందు హరిత తెలంగాణ టూరిజములో జోగులాంబ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్. పి. శ్రీనివాసరావు,ఎమ్. ఎల్. ఏ. విజయుడు,స్పీకర్ కు పుష్పగుచం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ సిబ్బంది గౌరవవొందనం చేసారు. ఆలయాలలో ఈ ఓ. అర్చకులు పూర్ణకుంబంతో స్వీకరుకు స్వాగతం పలికారు. ముందుగా స్వామి వారి ఆలయం లో అబ్బిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమర్చన పూజలు చేసారు.ఈ కార్యక్రమ్మలో తదితరులు పాల్గొన్నారు.

### ప్రశ్నార్థకంగా జూనియర్

# కళాశాల ఏర్పాటు!



మండల కేంద్రంలో కొనసాగుతున్న కస్తూర్బా పాఠశాల దృశ్యం



కొప్పునూరు కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ హాస్టల్

- ఆది నుంచి నేటికీ వలస చదువులేనా?
- ఉన్నత విద్యకోసం సుదూర ప్రాంతాలకు విద్యార్థులు
- మంత్రి సొంత మండలంలో కాలేజీ విద్యకు దూరమవుతున్న యువత
- కాలేజీ ఏర్పాటుకై ప్రజా సంఘాల డిమాండ్ నెరవేరేనా?

చిన్నంబావి, మే 6 ప్రభాతవార్త : నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దడానికి విద్య ఎంతో అవసరం... విద్య కోసం వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణాలకు విద్యార్థులు వలస వెళ్లి చదువుకోవడం విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఎంతో వ్యయంతో కూడుకుంది. కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని చిన్నంబావి మండలంలో ఆది నుంచి విద్య కోసం సుదూర పట్టణాలకు విద్యార్థులు ప్రయాణించి వేల రూపాయలు ఖర్చు చేసి చదువుకుంటూ సొంత ప్రాంతాలకు దూరంగా నివసిస్తున్నారు. ఇక్కడి పాలకులు ఉన్నత విద్యావంతులైనప్పటికీ మండల పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదా గురుకుల పాఠశాల ఏర్పాటు ఆలోచన చేయకపోవడం ఎంతో దారుణమైన విషయం. ఈ విషయంపై పలుమార్లు ప్రజాసంఘాల నాయకులు పోరాటాలు చేసినప్పటికీ, నేటికీ మండలంలో కాలేజీ విద్య మిథ్యగా మారింది. సుమారు 45 ఏళ్ల క్రితం శ్రీశైలం ప్రాజెక్టు తిరుగుజలాల్లో మండలానికి చెందిన 11 గ్రామాలు సర్వం కోల్పోయి నిర్వాసిత గ్రామాలుగా ఒకవైపు ప్రజలు, విద్యార్థులు వలస బాట పట్టి జీవించడం చూసాం! అదేవిధంగా అంతో ఇంతో వసతి కలిగి వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్న పలు కుటుంబాల విద్యార్థులు 10వ తరగతి వరకు చదివి ఆ తర్వాత చదువులు మానేస్తూ వ్యవసాయ కార్మికులుగా, హమాలీలుగా, గని కార్మికులుగా మండలంలో కొనసాగుతున్నారు. దీనికి కారణం పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఉన్నత విద్య కళాశాలలు ఏర్పాటు చేయకపోవడం వలన అభివృద్ధికి నోచుకోవడం లేదు. చిన్నంబావి నూతన మండలంగా ఏర్పడి పది సంవత్సరాలుగా కావస్తున్న, నేటికీ కళాశాల విద్యకు దూరమవుతున్నారు. మండలంలో కస్తూర్బా పాఠశాల ఏర్పడి సుమారు ఆరేళ్లు దాటిన అట్టి పాఠశాలలో 10వ తరగతి వరకు మాత్రమే విద్య కొనసాగుతుంది. ఇటీవల కేజీబీవీలో నూటికి నూరు శాతం విద్యార్థులు పాస్ అవ్వడం, అలాగే అదే పాఠశాలకు చెందిన విద్యార్థి మండల టాపర్‌గా నిలవడం జరిగింది. అనేక మండలాల్లో కేజీబీవీ పాఠశాలలు అప్‌గ్రేడ్ అయి కళాశాల విద్యా కొనసాగడం చూస్తున్నాం. రాష్ట్ర ఎక్సైజ్ టూరిజం శాఖ మంత్రిగా కొనసాగుతున్న జూపల్లి కృష్ణారావు సొంత చిన్నంబావి మండలంలో ఉన్నత విద్య సంస్థలు లేకపోవడం వల్ల సామాన్యుల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలలో ఐదు రకాల ఇంటర్మీడియట్ కోర్సు ఏర్పాటు చేసి పాఠశాలను కళాశాలగా అప్ గ్రేడ్ చేయాలని, అలాగే నూతన గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాల లేదా ప్రభుత్వ పాలిటెక్నిక్ లేదా ఐటిఐ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత విద్యార్థులు పలుసార్లు పాలకుల దృష్టికి తీసుకొచ్చారు. మండల పరిధిలో 2000 మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. 10వ తరగతి 200 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వారికి ఉన్నత విద్య సొంత మండలంలో కాకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే వ్యయబారంతో కూడుకున్న వ్యవహారం. దీంతో నేటికీ ఉన్నత విద్య ఈ ప్రాంత విద్యార్థులకు దూరంగానే ఉంది. మండల అభివృద్ధిలో భాగంగా, ఈ ప్రాంత విద్యార్థులకు నూతన విద్యాసంస్థలు నెలకొల్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. పలుసార్లు ప్రజాసంఘాల డిమాండ్‌గా ఉన్న కళాశాల విద్య ఈసారైనా నెలకొల్పుతారో! లేదో! వేచి చూడాలి. ప్రాంత అభివృద్ధి కోసం స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఈ ప్రాంతంలో విద్యాసంస్థల నెలకొల్పాల్సిన బాధ్యత మంత్రి జూపల్లికి ఉందని ప్రజలు భావిస్తున్నారు. మండలంలో ఉన్న కస్తూర్బా పాఠశాలను కళాశాలగా మార్చడానికి అన్ని వసతులు ఉండడంతో వీలైనంత త్వరగా కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతున్నారు. అలాగే కొప్పునూరులో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలగా మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



> **దూరప్రాంతాలైన కొల్లాపూర్, వనపర్తి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ లాంటి దూరప్రాంతాల్లో చదువుకుంటున్నాం. మండలంలో జూనియర్ కళాశాల విద్యను లేదా పలు గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఉన్నత విద్య లభిస్తుంది.**
>
> *ఆది ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి*

# దురదృష్టవశాత్తు ప్రమాదం..!

- అగ్నికి ఆహుతి అయిన గన్ని బ్యాగులు, మర ఆడించిన బియ్యం...!
- షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందన్న రైస్ మిల్లు సిబ్బంది...!
- నష్టం ఇప్పుడే అంచనా వేయలేమన్న బాధితులు....!
- 24 గంటలు గడిచిన కాలుతున్న గన్ని బ్యాగుల ఆనవాళ్లు....!



ప్రమాదంలో కాలిపోయిన గన్ని బ్యాగులు, సిఎంఆర్ రైస్, పలు మిషనరీలు

**వనపర్తి ప్రతినిధి,మే6 ప్రభాతవార్త :**వనపర్తిజిల్లా పెబ్బేరు మండల పరిధిలో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ఘటనలతో కోట్లల్లో



కాలిపోయిన సీఎంఆర్ రైస్‌ను జెసిబి సహాయంతో తొలగిస్తున్న సిబ్బంది

నష్టం వాటిల్లుతుందని బాధితులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. గత ఏడాది ఏప్రిల్ మాసంలో జరిగిన ఘటన మరువకముందే సోమవారం సాయి గోపాల్ పారాబాయిల్డ్ రైస్ మిల్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. జరిగిన సంఘటనకు సంబంధించిన అంశాలను మంగళవారం వార్త బృందం పరిశీలించి బాధితులతో మాట్లాడడంతో వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**సిబ్బంది కొరత వల్లే రైస్ మిల్లు రెండు నెలలు మూత...!!**

దాదాపు రెండు నెలలపాటు సిబ్బంది కొరత ఉండడంతో రైస్ మిల్లులు మూతవేయడం జరిగిందని,అధికారుల ఆదేశాలమేరకు రైస్ మిల్లును రెండు రోజుల క్రితమే పునఃప్రారంభించడం జరిగిందని,అంతలోనే ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన తలుచుకుంటే ప్రాణం విలవిలలాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.2024,25 వానాకాలానికి సంబంధించిన వరిధాన్యం ఇచ్చేందుకు మూడు ఏసీకేల మర ఆడించిన బియ్యం అగ్నికి ఆహుతి అయినట్లు వారు తెలిపారు. ప్రమాదంలో ఎంత మేర ఆస్తి నష్టం జరిగిందో అంచనా వేయలేకపోతున్నామని వారు పేర్కొన్నారు. దీంతో పాటుగా ఎలాంటి ప్రాణం నష్టం జరగలేదన్నారు. రైస్ మిల్ అగ్నిప్రమాద సమాచారం తెలుసుకున్న సివిల్ సప్లై అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

## రాజోలి మండలంలో పర్యటించిన అదనపు కలెక్టర్

**మానవపాడు, మే 6 ప్రభాతవార్త :** రాజోలి మండలంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు మంగళవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా ముందుగా నసనూరు గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం పై గ్రామస్తులతో చర్చించారు. ఈ చర్చలో భాగంగా గ్రామస్తులు కోరినట్లుగా వివిధ రకాలైనటువంటి పనులను తెలియజేశారు. అనంతరం పెద్ద ధన్వాడ గ్రామంలో పొలం బాటల పనిని పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కూలీలతో ముఖాముఖి మాట్లాడుతూ ప్రతి కూలికి రోజుకు కూలీ రూ.300 పడేవిధంగా పనిచేయాలని కూలీలకు, టిఏకు సూచించారు. పచ్చర్లలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. దాంట్లో భాగంగా తుమ్మిళ్ల రైతులు నుంచి సంచుల కొరతను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు, దీనిపై వెంటనే సంబంధిత అధికారులతో సమస్యను తీర్చే విధంగా ఆదేశాలు జారీ చేశారు పచ్చర్ల గ్రామంలో స్నేహ మీటింగ్‌ను, ఉపాధి హామీ పథకం కింద నాలుగు పశువుల పాకలను ఎరువు గుంతలను మొదలగు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఖాజా మొయినుద్దీన్, ఏపీవో ప్రసాద్, ఏపీఎం మార్తమ్మ, మూడు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

# భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజల వద్దకే అధికారులు

**ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి .. వావిలాల రెవెన్యూ సదస్సులో 49 దరఖాస్తులు**

**ఇటిక్యాల, మే 6 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం భూభారతి కొత్త చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వాటిని పరిష్కరించేందుకుగాను అధికారులు ప్రజల వద్దకు వచ్చారని రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ బియం సంతోష్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వావిలాల గ్రామంలో రెండవ రోజు తహసిల్దార్ వీరభద్రప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్. కలెక్టర్ లక్ష్మినారాయణ పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి,వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెడుతున్న భూ భారతి ఆర్వోఆర్ చట్టం అమలులో భాగంగా జిల్లాలో ఇటిక్యాల మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాలోని 28 మండలాల్లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించబడుతున్నట్లు వివరించారు. ధరణీ స్థానంలో భూ భారతి భూమి హక్కుల చట్టం తీసుకురావడం జరిగిందని గతంలో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అధికారుల వద్దకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు అధికారులు ప్రజల వద్దకు వచ్చి, భూ సమస్యల కోసం దరఖాస్తులను తీసుకోవడం జరుగుతుందని రైతులు ఇచ్చిన ప్రతి దరఖాస్తును అధికారులు ఆన్‌లైన్ లో నమోదు చేయడం జరుగుతుందని వాటిని అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఈ నెలాఖరులోపు వారికి సంబంధించిన భూ సమస్యల పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. మొదటి రోజు భూ సమస్యలపై గోపల్ దిన్నె



వావిలాల రెవిన్యూ సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్




రైతుల నుండి భూ సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్, అదనపు కలెక్టర్ లక్ష్మినారాయణ

గ్రామంలో 21 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఆ సమస్య పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు పూర్తిగా ఉచితంగా తీసుకోవడంతో ఈ సదస్సుల్లో మాత్రం రైతులు ఎటువంటి ఫీజు లేకుండా తమ హక్కుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని గతంలో మీ సేవ కేంద్రాలలో డబ్బులు చెల్లించేవారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు,విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు,భూ స్వభావం తప్పులు,నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, పెండింగ్ సాదా బైనామా,సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం వంటి వాటిని పరిష్కరిస్తున్నామన్నారు.భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రెవెన్యూ సదస్సులలో ప్రధానంగా పట్టాదారు పాత పాసుపుస్తకాల లో ఉన్న సర్వే నంబర్ల భూమి కొత్త పాస్ పుస్తకంలో –మిగతా2లో..

## వేసవి శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట టౌన్, మే 6 ప్రభాతవార్త:** జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన వేసవి శిబిరాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిబిరానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. శిబిరంలో ఉపాధ్యాయులు ఏమేమి నేర్పిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చే విద్యార్థులకు యోగాతో పాటు ఆంగ్లం, గణితము, భౌతిక శాస్త్రంపై మంచి పట్టు వచ్చేలా తర్ఫీదు ఇవ్వాలని అక్కడి ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా తొమ్మిదో తరగతి ఉత్తీర్ణత సాధించి పదో తరగతికి వెళ్లే విద్యార్థులకు ఆయా సబ్జెక్టులలో సామర్థ్యాన్ని పెంచేలా ఇప్పటి నుంచే శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచాలన్నారు. శిబిరంలో రోజూ వారీగా ఏఏ అంశాలలో శిక్షణ ఇచ్చారనే విషయాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే ఈ 15 రోజుల పాటు క్రమం తప్పకుండా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆమె సూచించారు.


విద్యార్థినిలతో మాట్లాడుతున్న కలెక్టర్

## అపూర్వ కలయికతో ఆత్మీయ సమ్మేళనం

**కోయిలకొండ, మే 6 ప్రభాతవార్త :** దాదాపుగా 39 సంవత్సరాల తర్వాత నాటి బాల్యమిత్రులు ఒకే చోట చేరిన వేళ. ఆప్యాయతతో పలకరింపులు, ప్రేమాభిమానాలతో క్షేమ సమాచారాల గురించి అడిగి తెలుసుకోవడం, చిన్ననాటి బాల్యమిత్రులు కొంతమంది ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణిస్తూ మరికొంతమంది ప్రైవేటు ఉద్యోగాల్లో స్థిరపడి ముందుకు సాగుతూ మరి కొంతమంది రాజకీయ రంగాలలో ప్రజా ప్రతినిధులుగా సాగుతూ ఒకే వేదిక దగ్గర కలుసుకున్న 1986 –1987 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు మంగళవారం మండల కేంద్రమైన కోయిలకొండలోని పూర్వపు విద్యార్థుల సమావేశం నిర్వహించి ఆత్మీయ సమ్మేళనం గావించారు. తమకు విద్యానందించిన పూర్వపు ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానం చేసి గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు బచ్చిరెడ్డి, హనుమయ్య, శ్రీకాంత్, రాములు, నరేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జగదీష్, వేణు, చుక్కయ్య, ఆంజనేయులు, నరసింహులు, సత్యమ్మ, రజిత, శోభారాణి, అనురాధ, వరలక్ష్మి, చంద్రకళ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

## రాజీవ్ యువ వికాసంపై ఇంటర్వ్యూలు

**ఉప్పునుంతల, మే 6 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం స్కీం కోసం మైనార్టీ కార్పొరేషన్ దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నేడు బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎంపీడీఓ సమావేశపు హాలులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌లాల్ తెలిపారు. అదేవిధంగా రేపు గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం స్కీం ఎస్టీ కార్పొరేషన్ కోసం దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు ఉంటాయని, ఈనెల 12 సోమవారం బిసికార్పొరేషన్‌కు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూ ఉంటాయని, 13న మంగళవారం ఎస్సీ కార్పొరేషన్‌కు దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్ లాల్ వివరించారు. మీసేవల ద్వారాగాని, నేరుగా ఆఫ్లైన్ చేసుకున్న నిరుద్యోగ యువతీ, యువకులు ఇంటర్వ్యూలకు హాజరయ్యే ముందు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఎంపీడీఓ వివరించారు.

## ఎన్టీఆర్ కళాశాల విద్యార్థినికి బెస్ట్ క్యాడెట్ అవార్డు

**మహబూబ్‌నగర్, మే6 ప్రభాతవార్త:** ఎన్సీసీ విభాగంలో సిడబ్ల్యూఎస్ పరిధిలో నిర్వహించిన బెస్ట్ క్యాడెట్ కాంపిటీషన్లో, మహబూబ్‌నగర్‌కు చెందిన ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థిని సీనియర్ అండర్ ఆఫీసర్ కర్నికోట సౌమ్య తన ప్రతిభతో రెండవ బెస్ట్ క్యాడెట్‌గా ఎన్నికయింది. ఇందుకు గాను హైదరాబాద్ గ్రూప్ కమాండర్ కల్నల్ ప్రశాంత్ కుమార్, 8 వ తెలంగాణ బెటాలియన్ కమాండర్ కల్నల్ ఎస్‌కె సింగ్ సౌమ్యకి బెస్ట్ క్యాడెట్ అవార్డును ప్రధానం చేసి, విజేతకి క్యాష్ ప్రైజ్ ని అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ సౌమ్యని ప్రత్యేకంగా అభినందించారు. తను ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా కోరుకున్నారు. అదేవిధంగా వైస్ ప్రిన్సిపాల్స్ డా. పద్మఅనురాధ, అమీనా ముంతాజ్, ఎన్‌సిసి సిటిఓ సిహెచ్ రవళి, కళాశాల అధ్యాపక బృందం తమ కళాశాల అమ్మాయి సౌమ్యకి బెస్ట్ క్యాడెట్ అవార్డు రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.


అవార్డు అందుకుంటున్న దృశ్యం

## అధ్యాపకుల నూతన కార్యవర్గం ఏర్పాటు

**మహబూబ్‌నగర్, మే6 ప్రభాతవార్త:** పాలమూరు పాలమూరు యూనివర్సిటీలో రెగ్యులర్ అధ్యాపకులు పాలమూరు యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అనే నూతన సంఘాన్ని ఏర్పాటు చేస్తూ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా ప్రొ॥ ఎం. జైపాల్ రెడ్డి, జనరల్ సెక్రెటరీగా అసోసియేట్ ప్రొ॥ డా. ఎన్. కిషోర్, ముఖ్య సలహాదారుగా ప్రొ॥ పిండి పవన్ కుమార్, ఉపాధ్యక్షులుగా డా. మధుసూదన్ రెడ్డి, డా. నూర్జహాన్, డా. చంద్ర కిరణ్, కోశాధికారిగా డా. అనురాధ రెడ్డి, జాయింట్ సెక్రెటరీస్ రాజకుమార్, శాంతి ప్రియ, మార్క్ పోలోనియస్, కల్చరల్ సెక్రెటరీ డా. కె. ప్రవీణ, పాలకమండలి సభ్యులుగా డా. కుమారస్వామి, డా. కృష్ణయ్య, డా. అంకం భాస్కర్, డా. విజయలక్ష్మి, డా. ఎన్ సంధ్యారాణి, డా. మాలవి, డా. సిహెచ్ వెంకట్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు కార్యవర్గంతో కూడిన పత్రాన్ని రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్ బాబుకి అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రొ॥ ఎం. జైపాల్ రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రయోజనాల కోసం, అధ్యాపకుల సమస్యలపై, అధ్యాపకులకు దక్కాల్సిన ప్రయోజనాలపై సంఘం పనిచేస్తుందన్నారు.


రిజిస్ట్రార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న నూతన కమిటీ సభ్యులు

## భక్తుల సౌకర్యార్థం నీటి సౌకర్యం..

**నారాయణపేట టౌన్, మే 6 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణం పదో వార్డులో ఎల్లమ్మ ఆలయం వద్ద నీటి సౌకర్యం లేని కారణంగా భక్తులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్చార్జి పళ్ళ అనిల్ కుమార్ సొంత డబ్బులతో పైప్ లైన్ ఏర్పాటు చేసి వాటర్ ట్యాప్ కనెక్షన్ ఇప్పించారు. ఆలయం వద్ద నీటి సౌకర్యం కల్పించడం పట్ల కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్‌కు వార్డు సభ్యులు, భక్తులు రాసూరు గోవిందప్ప, నీలి శ్రీనివాస్, నీలి వెంకటేష్, చింటూ రమేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ట్రెసా జిల్లా అధ్యక్షుడిగా సి.నరసింగరావు ఎంపిక

**మహబూబ్‌నగర్ మే 6 ప్రభాతవార్త:** తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా సి. నర్సింగరావు ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా దేవరకద్ర డిప్యూటీ తహసిల్దార్ కాలేద్దీన్ ఎక్బాల్, అసోసియేట్ అధ్యక్షుడిగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ ఏవో శంకర్ ఎంపికయ్యారు. ఇవాళ హైదరాబాద్ ట్రెసా భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ట్రెసా మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా నర్సింగరావును ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికైన నర్సింగరావు ప్రస్తుతం జడ్చర్ల తహసీల్దార్‌గా కొనసాగుతున్నారు. ప్రసాద్ రాష్ట్ర నాయకులు వంగ రవీందర్ రెడ్డి, గౌతమ్ లతోపాటు రాష్ట్ర నాయకులు ఈ ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈనెల 21న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న ప్రమాణ స్వీకార కార్యక్రమంలో నూతన అధ్యక్ష కార్యదర్శులు, అసోసియేటెడ్ అధ్యక్షుడు బాధ్యతలు స్వీకరించనున్నట్లుగా సమాచారం. నూతన కార్యవర్గాన్ని మహబూబ్‌నగర్ జిల్లా ట్రెసా నాయకులు అభినందించారు.


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

# మోతాదురులతో అధిక దిగుబడులు సాధ్యం

**బిజినేపల్లి, మే 6 ప్రభాతవార్త :** వ్యవసాయంలో రైతాంగం నేలని బట్టి తగిన మోతాదులో ఎరువులను వాడినట్లయితే పంటలలో మంచి దిగుబడి సాధించవచ్చని విస్తరణ విభాగం శాస్త్రవేత్త అర్చన అన్నారు. మంగనూరు లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు అధిక మొత్తంలో ఎరువులు వాడడం వల్ల తమ ఉత్పాదకత, నాణ్యతలోను ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీంతో దిగుబడి కూడా తక్కువగా వస్తుందని వివరించారు. రైతులు పంటలు సాగు చేసే ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా శాస్త్రవేత్తలు సూచన సలహాలు పాటించి పంటలను సాగు చేసుకోవాలన్నారు. నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని వరితో పాటు ఆరుతడి పంటలసాగు ఎంతో మేలని చెప్పారు. పచ్చి రొట్టె ఎరువుల వాడకంతో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించే అవకాశం ఉంటుందని వివరించారు. మెట్ట సేద్యం కింద అధికంగా సాగవుతున్న పత్తి, మొక్కజొన్న పంటలకు సంబంధించి ముఖ్యంగా నాణ్యమైన విత్తనాల సేకరణ పై రైతులు దృష్టి సరించాలని అన్నారు. రైతు బీమా, రైతు భరోసా, పిఎం కిసాన్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను ఉపయోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త విలాకర్, మండల వ్యవసాయ అధికారి నీతిరెడ్డి, ఏఈఓ క్రాంతి కుమార్, సింగిల్ విండో డైరెక్టర్లు సత్యనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, ఆయిల్ ఫామ్ క్లస్టర్ ఆఫీసర్ శివరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాల్యానాయక్ రైతులు పాల్గొన్నారు.


రైతులనుద్దేశించి మాట్లాడుతున్న శాస్త్రవేత్త

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కోయిలకొండ, మే 6 ప్రభాతవార్త :** నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం కోయిలకొండ మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా పార్టీ శ్రేణులు జరుపుకున్నారు. స్వామి వివేకానంద చౌరస్తా ప్రాంతంలో ఆ పార్టీ నాయకులు భారీ కేకును కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకల సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, కోయిలకొండ మాజీ సర్పంచ్ బి కృష్ణ మాట్లాడుతూ ప్రతినిత్యం ప్రజా సేవ కోసం పాటుపడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ జెడ్పిటిసి సభ్యుడు విజయ భాస్కర్ రెడ్డి, ఖాజీపూర్ మాజీ సర్పంచ్ కల్పనా వచ్చి రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి ఆంజనేయులు యాదవ్, పట్టణ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డి నారాయణ గౌడ్, నాయకులు పి లక్ష్మినారాయణ గౌడ్, జమాల్‌పూర్ శివ కుమార్ గౌడ్, గువ్వ కురుమయ్య, ఆరే రమేష్, శ్యాంసుందర్, పులి నరసింహులు, నాజిమ్, పానుగంటి నాగేష్, వీరన్న పల్లి రమేష్, గుమ్మడి శ్రీనివాసులు, ఎం భరత్, సోహెల్, ఇబ్రహీంనగర్ శేఖర్, మడుగు నరసింహులు, హరి సింగ్, వెంకటాపూర్ బోరు సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న దృశ్యం

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

**చిన్నచింతకుంట, మే6 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో టియుసిఐ, సిఐటియు, ఏఐటీయూసీ సంఘాలు సంయుక్తంగా మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో టియు సిఐ జిల్లా అధ్యక్షులు జెఎన్. దేవదానం, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వేణుగోపాల్, ఏఐటీయూసీ ప్రతినిధి దేవానందం, టియు సిఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడులు మాట్లాడుతూ ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె కు కార్మిక లోకం కదలిరావాలని పిలుపునిచ్చారు. దేశంలో 46కోట్ల అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై జాతీయ సంఘాలు ఒకతాటిపైకి వచ్చాయన్నారు కేంద్రము తీసుకొచ్చిన నాలుగు చట్టాలను వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు అందరికీ జీవనోపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో బీడీ కార్మికులు, భవన నిర్మాణకార్మికులు, ఆటోవర్కర్స్, అంగనవాడి కార్మికులు, ఆశా వర్కర్లు, కేజీబీవీ వర్కర్లు, రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ లు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఇందులో భాగంగానే బీడీయాజమాన్యాలకు సమ్మె నోటీసు, గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలపైన సమ్మె నోటీస్, మండల సూపరిండెంట్‌కు సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. అమరుల ఆశయాలకై పోరాటం చేద్దాం మండల కేంద్రంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, టియుసిఐటివైఎల్ సంఘాల ఆధ్వర్యంలో కామ్రేడ్ రాందాస్ చిన్నయ్యల వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు సిహెచ్ రామచందర్, దేవదానం, సాంబశివుడులు మాట్లాడుతూ అమరుల ఆశయాలకై ప్రతి ఒక్కరూ పనిచేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రన్న కొండన్న అడివన్న, రాజు నరసింహ రాజన్న ప్రేమరత్నం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘం నేతలు

## చేతకాక పోతే తప్పుకో రేవంత్ రెడ్డికి నామాజీ డిమాండ్

**నారాయణపేట టౌన్, మే 6 ప్రభాతవార్త :** అధికారంలోకి వచ్చేందుకు అడ్డదిడ్డంగా హామీలు ఇచ్చి కుర్చీపై కూర్చుని చేతులు ఎత్తేస్తామంటే కుదరదని చేతకాకపోతే ప్రజలకు భేషరతుగా క్షమాపణలు చెప్పి సిఎం పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డికి బిజెపి రాష్ట్ర సీనియర్ నేత, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అప్పు అడగడానికి వెళితే బిక్షగాళ్ళల చూస్తున్నారని అనడం సిఎం పదవికే సిగ్గు చేటని అన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రం దివాలా తీసిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. అధికారం కోసం ప్రజలనువభ్యపెట్టిఅధికారంలోకి వచ్చాక సిగ్గుమాలిన మాటలు మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ ల గారడితో 6 అబద్ధాలు 66 మోసాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. రైతు రుణమాఫి లేదు, ఏడాది అయినా రైతు బరోసా లేదని, మహాలక్ష్మి పేరుతో మహిళలను మోసం చేశారని అన్నారు. అలాగే గృహజ్యోతి తో మహిళలను మోసం చేశారని, వృద్దులకు చేయూత అందించలేదని, యువత వికాసం మరిచారని సొంతిల్లు కలగానే మిగిలి పోయిందని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు రోడ్డున పద్దారని అన్నారు. చేతులు ఎత్తేసేటోడివి ఏడాది సంబరాలు ఎలా జరుపుకున్నారని ప్రశ్నించారు. చేతకాకపోతే ప్రజలకు క్షమాపణలు చెప్పి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్. వచ్చే వాళ్ళు ఎలాగైనా అభివృద్ధి చేస్తారని అన్నారు. ఏడాదిన్నర కాలానికే చేతులు ఎత్తేసిన ఏకైక ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రకు ఎక్కుతారని అన్నారు.

## భూ సమస్యల సత్వర పరిష్కారానికై రెవెన్యూ సదస్సులు

(మొదటి పేజీ తరువాయి)

విధివిధానాల గురించి, చట్టంలో పొందుపర్చిన అంశాలపై అవగాహన కల్పించారు. రెవెన్యూ అధికారులతో కూడిన బృందాలు అందుబాటులో ఉంటూ భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో ఉచితంగా నిర్ణీత దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు దరఖాస్తు నింపి అధికారులకు సమర్పించాలని అన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన మీదట నిర్ణీత గడువులోపు భూ భారతి చట్టం ప్రకారం సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం పైలెట్ ప్రాతిపదికన మూసాపేట్ మండలంలో అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులలో తహశీల్దార్ రాజు ఇతర అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### పరువు పోయిందని పెళ్లి కొడుకు తండ్రి ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

పెళ్లి కూతురు ప్రియుడు వెంకటేష్‌తో వెళ్లి పోయింది. దాంతో తన కొడుకు పెళ్లి ఆగిపోవడంతో పాటుతమ పరువు పోయిందని మదనపడి పెళ్లి కొడుకు తండ్రి కాంజీ గోవిందరావు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే పెళ్లి కూతు రు ఇంట్లో కూతురి ప్రేమ వ్యవహారం తెలిసిన కప్పిపుచ్చి పెళ్లికి సిద్ధమై పరువు తీశారని దాంతో గోవిందరావు ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా పెళ్లి కూతురిని మామ వరుసకు చెందిన షోలాపూర్ కిషోర్, సంజీవ్ మరికొందరు ఆదివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో కేంచి గోపాల్ ఇంటి దగ్గరకు ప్రేమికులు ఇద్దరినీ కారులో ఎక్కించి పంపారని సిసి పుటేజీలను సైతం పోలీసులకు అప్పగించామని తెలిపారు. తన తమ్ముడు చావుకు కారణమైన వారిపై చర్య తీసుకోవాలని మృతుని సోదరుడు కాంజి నారాయణ రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### నూనె గింజల ఉత్పత్తిని పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎఫ్‌పిఓఎస్ సహకారంతో సుమారు 1500 హెక్టార్లలో (పల్లీ) వేరుశెనగ సాగును ప్రోత్సహించనున్నట్లుతెలిపారు. ఈఉద్దేశంతో రైతులకునాణ్యమైన విత్తనాల సరఫరా, ఉత్పాదకత పెంపునకు శిక్షణా కార్యక్రమాలు, కృషి విజ్ఞాన కేంద్రాల కెవికెఎస్ ద్వారా ఫార్మర్ ఫీల్డ్ స్కూల్స్ నిర్వహించనున్నట్లు వివరించారు. అలాగే మైక్రో ఇరిగేషన్ స్ప్రింక్లర్లు ఏర్పాటు కోసంఉద్యానవన శాఖ సహకారం అవసరమని, అలాగే ఆయిల్ ప్రొడక్షన్ యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించేందుకు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎల్‌డిఎం మద్దతు ఇవ్వాలని జాన్ సుధాకర్ విజ్ఞప్తి చేశారు. ఆయా ప్రతిపాదనలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన అన్ని రకాల సహాయాన్ని డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ విజయ్ కుమార్, ఇరిగేషన్ ఈఈ బ్రహ్మానందరెడ్డి, నారాయణపేట వ్యవసాయ అధికారులు, మద్దూరు, దామరగిద్ద, మక్తల్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, ఎఫ్‌పీ వో ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతుల బాధ పట్టదా..!

**రోడ్లపై అరపోసుకున్న వడ్లను ప్రభుత్వం కొనాలి**
**సిపిఐ (యంఎల్) మాస్ లైన్ డిమాండ్**

**చిన్నచింతకుంట, మే 6 ప్రభాతవార్త :** ప్రధాన రహదారులు, కల్లాలలో రోజుల తరబడి వడ్లు ఆరబోసుకున్న నేటికీ ప్రభుత్వం కొనలేదని సిపిఐ (యంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు సాంబశివుడు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో రైతులు ఆరబోసుకున్న వడ్ల కల్లాల వద్దకు మాస్ లైన్ నేతలు వెళ్లి రైతులతో మాట్లాడారు. ఎన్ని రోజుల నుంచి మీరు ఈ వడ్లను ఆరబెట్టారు. ఎందుకు కొనట్లేదు దీని బాధ్యులెవరు అని అడిగితే రైతులు మేము ఈ వడ్లను దాదాపు 25 రోజులుగా ఆరబెడుతున్నామని గన్ని బ్యాగులు, హమాలీలు కొరత ఉందని అధికారులు తెలుపుతున్నారు. అధికారులు మా వడ్ల వద్దకు రావడం లేదని రైతులు వాపోతున్నారన్నారు. తమ బాధను మొరపెట్టుకున్న రైతుల ఆవేదనను అర్థం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం నెలల తరబడి రోడ్లమీద పోసుకున్న వడ్లను వెంటనే కొనాలని, అదేవిధంగా రైస్ మిల్లులలో రెండు రకాల వడ్లను కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రెండు రకాల వడ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయని రైస్ మిల్లర్లపై తగు చర్య తీసుకోవాలని, రైతుకు బోనస్‌ను వెంటనే వారి ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు దేవదానం, డివిజన్ కార్యవర్గ సభ్యులు కోళ్ల వెంకటన్న, చంద్రన్న, నర్సింహా, రైతు చందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాస్ లైన్ నేతలు

## ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలి

**తపస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి నరసింహ**

**ఉట్కూర్, మే 6 ప్రభాతవార్త :** ఉట్కూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తపస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి నరసింహ కోరారు. ఉద్యోగుల సమస్యలకు పరి ష్కారం చూపాల్సిన ముఖ్యమంత్రి నిన్న ఇంతకుమించి నేనేమీ చేయలేను అని చెప్పిన మాటలు తీవ్ర నిరాశకు గురిచేశాయని వాపోయారు. ఉద్యోగ ఉపాధ్యాయులవి గొంతెమ్మ కోరికలు కాదని, ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కచ్చితంగా నెరవేర్చాలని సూచించారు.



## వాహనదారులకు పోలీసుల సూచనలు


సూచనలు చేస్తున్న పోలీసులు

**శ్రీరంగాపూర్, మే 6 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలం వెంకటాపురం గ్రామంలో వాహనదారులకు పోలీసులు పలు సూచనలు చేశారు. వాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ ఉండాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు అజాగ్రత్తగా ఉండొద్దన్నారు, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలని, రోడ్డు భద్రత నియమాలను పాటించాలని చెప్పడం జరిగింది. అనుమానితులు ఎవరైనా గ్రామంలో సంచరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మన్యపు రెడ్డి, సిబ్బంది రామకృష్ణ, భగీరథ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సమస్యతో విలేకరి వసీం మృతి

**ఊట్కూరు, మే 6 ప్రభాతవార్త :** గ్రామానికి చెందిన బండమీది గేరి వాసి అబ్దుల్ వసీం (32) రాష్ట్రీయ సహారా విలేకరి ఉదయం 11 గంలకి ఆయన స్వగృహంలో అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఆయన మృతికి స్థానిక మాజీ సర్పంచ్ సూర్య ప్రకాశ్ రెడ్డి వివిధ రాజకీయ పార్టీ నాయకులు విలేకరులు సంతాపం వ్యక్తం చేశారు.

## పెబ్బేరు సంత పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్లు

**పెబ్బేర్, మే6 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణానికి వివిధ గ్రామాల నుండి సొంత పనులు, వ్యాపారాల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ సూచన మేరకు పెబ్బేరు సంత పరిరక్షణ సమితి, శ్రీ వేణుగోపాల స్వామి భూమి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ వేసవి కాలము చలి వేంద్రాలను ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు పెబ్బేరు పట్టణం మూడు ప్రధాన కూడళ్లలో బస్టాండు, సుభాష్ చౌరస్తా, కొల్లాపూర్ కమాన్ చౌరస్తాలో ఈ చలివేంద్రాలను ము న్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, సంత కాంట్రాక్టర్లు, సంత సభ్యులు, రాజకీయ పార్టీల ప్రముఖులు పాల్గొని ప్రారంభించారు.

## సార్వత్రిక సమ్మె నోటీసు అందించిన పురపాలక కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది


సమ్మె నోటీసులు అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, మే6 ప్రభాతవార్త:** ఈనెల 20వ తేదీన చేపట్టే అఖిల భారత సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొంటారని సూచిస్తూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్‌కు తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందించారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, అదేవిధంగా కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మె నోటీసు అందించిన వారిలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు రమేష్, వెంకన్న, వెంకటయ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజల వద్దకే అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

తక్కువగా నమోదు కావడం. అలాగే పట్ట భూములు ఇనాం భూములుగా. ప్రభుత్వ భూములుగా నమోదు కావడం. అలాగే దేవుని భూములు రైతులు సాగు చేస్తుండగా వాటిని పట్టా భూములుగా మార్చాలని విరాసత్ కోసం మిస్సింగ్ సర్వే నంబర్ వంటి వాటిపై రైతులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. వావిలాల గ్రామంలో వివిధ రకాల భూ సమస్యలు పరిష్కరించాలని రైతులు 49 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మినారాయణ, ఇటిక్యాల తహసీల్దార్ వీరభద్రప్ప, ఎర్రవల్లి తహసీల్దార్ నరేష్, డిప్యూటీ తహసిల్దార్ వేణుగోపాల్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రవికుమార్, సీనియర్ అసిస్టెంట్లు మనోహర్, నరేష్, ఆర్ఐలు మదన్ మోహన్, గురుమూర్తి, సర్వేయర్లు దౌలమ్మ, అనసూయ, తహసిల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి శంకర్ నాయక్, సిబ్బంది రైతులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు, కార్తీక్, జీవన్, ఎం.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు ఇంటర్మీడియట్ కీలక దశ

■ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

■ పదో తరగతి పరీక్షలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను అభినంధించిన కలెక్టర్

**గద్వాల మే 6,ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్ష-2025లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అభినందించారు.మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల నుండి పదవ తరగతి పరీక్షల్లో 550 మార్కులపైగా సాధించిన 34మంది ప్రతిభావంతులైన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ప్రతి విద్యార్థి వారి భవిష్యత్ ప్రణాళికల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జోగులాంబ గద్వాల జిల్లా పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రంలో 32వ స్థానం నుండి 26వ స్థానానికి పురోగతి సాధించి,10.36 పెరుగుదలతో ఉత్తమ ఫలితాన్ని సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే క్రమశిక్షణ,కష్టపడే తత్వం, తమపై పూర్తి నమ్మకం కలిగి ఉండాలని అన్నారు.



పదిలో మంచి మార్కులు తెచ్చిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్, డీఈఓ

మంచి ఫలితాలుసాధించేందుకు నిరంతరం కృషి చేయాలని, ఇంటర్మీడియట్ దశ విద్యార్థుల భవిష్యత్తుకు దిశను నిర్ణయించే కీలక దశగా ఉంటుందని, ఈ సమయంలో ప్రతి విషయాన్ని లోతుగా అర్థం చేసుకుంటూ, సమయాన్ని ప్రతిదినం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హార్డ్ వర్క్ మాత్రమే కాదు,స్మార్ట్ వర్క్ కూడాఈ రోజుల్లో చాలా అవసరమని సూచించారు. టెక్నాలజీని మంచి ప్రయోజనాల కోసం ఉపయోగించడం చాలా ముఖ్యమైనదని అన్నారు.మంచి స్నేహితులతో ఉండాలని,చెడు అలవాట్లను దూరం ఉంచాలని సూచించారు. విద్యతో పాటు శారీరక ఆరోగ్యం కూడా ముఖ్యమని,ప్రతి రోజూ విద్యార్థులందరూ వ్యాయామం చేయాలని సూచించారు.ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున, విజయం సాధించడానికి ప్రతి రోజూ నిరంతరం అభివృద్ధి,అప్డేట్ అవ్వాలన్నారు. భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాల కోసం మరింత కృషి చేసి విద్యారంగాన్ని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. ప్రభుత్వంవిద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందిస్తోందని, ఉత్తమ రెసిడెన్షియల్ సౌకర్యాలు, ఉచిత విద్య,ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారంఅందించేందుకు ప్రభుత్వం మెస్ ఛార్జీలను 40 పెంచినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని,భవిష్యత్తులో ప్రతి విద్యార్థి తమ లక్ష్యాలను సాధించి, దేశానికి సహాయం చేస్తూ,దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. జిల్లాలో పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విశేషకృషి చేసిన,ఉపాధ్యాయులకు, విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ అబ్దుల్ గని, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లు, అల్పాహార కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలి

- ఆహార భద్రత ఇంఛార్జ్ అధికారి డా.రామచంద్ర రావు



హోటల్‌ను తనిఖీ చేస్తున్న ఆహార భద్రత ఇంఛార్జ్ అధికారి

**వనపర్తి, మే 6 ప్రభాతవార్త:** జిల్లాలోని హోటళ్లు, అల్పా హార కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని ఆహార భద్రత ఇంచార్జి అధికారి డా. రామ చంద్ర రావు హెచ్చరించారు. మంగళవారం వనపర్తి పట్టణం లోని ఒక ఉడిపి హోటల్లో ఇడ్లీలో జెర్రి శీర్షికన వచ్చిన వార్తకు స్పందించి ఉడిపి హోటల్‌ను తనిఖీ చేశారు.నిబంధన ప్రకారంపరిశుభ్రత లేకపోవడంతో నోటీస్ జారీ చేస్తున్నట్లు తెలిపారు.హోటళ్లు, అల్పాహార కేంద్రాల్లో పరి శుభ్రత పాటించాలని లేనిపక్షంలో లైసెన్స్ రద్దు చేయడం జరుగు తుందని హెచ్చరించారు.

## జమ్ములమ్మ జాతరలో ట్రాఫిక్ జామ్



**గద్వాల, మే 6,ప్రభాతవార్త:** మంగళవారం గద్వాల పట్టణం జమ్మిచేడు జమ్ములమ్మ దేవతకు మొక్కుబడులు చెల్లించుటకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.దీంతో జమ్ములమ్మ గుడి దగ్గర, గద్వాల, కర్నూల్, హైదరాబాద్ రోడ్డు పైన ట్రాఫిక్ జామ్ అయినది. భక్తులకు, పట్టణ ప్రజలకు చాలా ఇబ్బందులు ఏర్పడ్డాయి. తీవ్రమైన ఎండలో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయి ట్రాఫిక్ కొన్ని వందల వాహనాలు నిలిచి పోయాయి. వాహనాలు ఆగి ఉన్న సందర్భంగా వృద్ధులు ,చంటి పిల్లలు ఎండకు తీవ్రంగా ఇబ్బందులు పాలయ్యారు. ట్రాఫిక్ జామ్ కాకుండా దేవాదాయ శాఖ వారు,పోలీస్, సంబంధిత శాఖల ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.ప్రతి మంగళవారం, శుక్రవారం జమ్ములమ్మ గుడి దగ్గర ట్రాఫిక్ జామ్ కాకుండా భక్తులకు ఇబ్బంది ఏర్పడకుండా చూడాలని భక్తులు జిల్లా అధికార యన్త్రాగాన్ని కోరుతున్నారు.

## రాజీవ్ యువ వికాసంలో బ్యాంకర్లదే కీలకపాత్ర

**నారాయణపేట టౌన్, మే 6 ప్రభాతవార్త:** రాజీవ్ యువ వికాసంలో బ్యాంకర్లది కీలకపాత్ర ఉంటుందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. మంగళవారం నారాయణపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎల్‌డిఎం డిబిసిడిఓ డిఎండబ్ల్యూఓ ఎంసి ఎంపీడీవోలతో కలిసి జేఎంఎల్‌బిసి సమావేశానికి హాజరయ్యారు.రాజీవ్ యువ వికాసం పథకం మార్గదర్శకాలను వివరించారు. బ్యాంక్ నిబంధనల ప్రకారం అభ్యర్థుల అర్హతను ధృవీకరించే డాక్యుమెంటేషన్‌ను పూర్తి చేయాలని, ఒక వారంలోపు తాత్కాలిక అర్హత గల అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని, తదుపరి ప్రక్రియ కోసం ప్రతిరోజూ సంబంధిత ఎంపీడీవోలకు అందించాలని బ్యాంక్ మేనేజర్‌లను కోరడం జరిగింది.

## వివాహ వార్షికోత్సవాలు నిర్వహించిన బీఆర్ఎస్ నేతలు

**భూత్పూర్,మే 6,ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపల్ పట్టణ పరిధిలో మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెళ్లి రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.పట్టణ కేంద్రానికి చెందిన పార్టీ సీనియర్ నేత టి మురళీధర్-భవానిల పెళ్లి రోజు వేడుకలు టీఎం గౌడ్ నివాసంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాము రాథోడ్,గడ్డం ప్రేమ్‌కుమార్,గడ్డం రాములు, గడ్డం యాదయ్య,నెల్లి నర్సింహులు,మాల విఠల్‌దాస్ వెంకటేష్, మొహ్మద్ ఆహ్మాద్ తదితరులు పాల్గొన్నారు.ఇదేవిధంగా మున్సిపల్ పరిధిలోని గోప్లాపూర్ మూడో వార్డుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేకల సత్యనారాయణ వివాహ వార్షికోత్సవాన్ని పార్టీ కార్యకర్తలు,కుటుంబీకులు ఘనంగా నిర్వహించారు.

## ఉపాధి పనుల పర్యవేక్షణ



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఏపీడి సుల్తాన్, ఏపీవో

**పానగల్: మే 6 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడి సుల్తాన్ పర్యవేక్షించారు.మంగళవారం మండలంలోని రాయినిపల్లి బుసిరెడ్డిపల్లి మహమ్మదాపూర్ గ్రామాలలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు నర్సరీలు, అదేవిధంగా గ్రామపంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలలో లేబర్ను ఇంప్రూవ్ చేయాలని అదే విధంగా నర్సరీలు రెగ్యులర్‌గా మానిటర్ చేయాలని, హార్టికల్చర్ అన్ని గ్రామాలలో తీసుకోవాలని, కూలీలతో సగటు వేతనము 307రూపాయలు వచ్చే విధంగా పనిచేయించాలని సూచించారు అలాగే వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందరావు ఏపీవో కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**ఆత్మకూరు మే 6 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని జాతర మైదానం ప్రాంగణంలో ఆత్మకూర్ పోలీస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై యువకులకు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ మన్యపు రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలపై ముఖ్యంగా యువతీ యువకులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన సూచించారు అపరిచిత వ్యక్తుల నుండి ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చినా స్పందించకుండా ఉండాలని ఒకవేళ సైబర్ క్రైమ్ పోలీసుల పేరిట ఫోన్ కాల్స్ చేసి ఎవరైనా తప్పు దోవ పట్టించేందుకు ప్రయత్నిస్తే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు ప్రస్తుతం రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా సైబర్ నేరాలపై అవగాహన లేకపోవడం చేత పలువురు యువతీ యువకులు నేరాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అందులో భాగంగానే వనపర్తి జిల్లా ఎస్పీ గిరిధర్ ఆదేశాల మేరకు ఆత్మకూర్ పోలీస్ సభ్యులు పరిధిలో యువతీ యువకులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లుగా ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది భూపాల్ రాములు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీశేషాదాసుల ఆరాధన ఉత్సవాలు

**మల్దకల్ మే 6 ప్రభాతవార్త:** ప్రముఖ కర్ణాటక వాగ్గేయ కారుడు శ్రీ శేషదాసుల 140వ ఆరాధన ఉత్సవాలు ఆదిశిలా క్షేత్రం మల్దకల్‌లో మూడు రోజులపాటు ఘనంగా నిర్వ హించారు. శ్రీ శేషదాసుల వంశస్తులైన శేషగిరిరావు, దీరేంద్ర దాస్, రాఘవేంద్ర దాస్,విష్ణు,శశాంక ఆధ్వర్యం లో ఆరాధన ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మంగళవారం శ్రీ సత్యనారాయణ పూజ, అభిషే కాలు నిర్వహించారు.అనంతరం సంగీత కాకండికి ఆదోని, వసంతా చారి అధ్యాపకులు, జయరామాచార్య ఆధ్వర్యంలో పురాణ ప్రవచనాలు వినిపించారు. శేషదాసుల వారి మహిమ గురించి భక్తులకు వివరించడం జరిగింది.ఈ సందర్భంగా దీరేంద్రదాస్ మాట్లాడుతూ ఉత్సవాలు విజయవంతంగా ముగియడానికి భక్తుల సహకారం, దేవాలయ నిర్వహకుల సహకారం ఎంతో ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, పట్వారీ అరవింద రావు, చంద్రశేఖరరావు, బాబురావు, మధుసూదనా చారి, రమేష్, రవి, ప్రాణేష్, వెంకోబారావు, మనోహర్‌రావు, ప్రకాష్‌రావు, గోపాల్‌రావు,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ బీజేపీనే

బీజేపీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు ఆంజన్ కుమార్

**గద్వాల, మే6,ప్రభాతవార్త:** దేశంలో, రాష్ట్రంలో అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ బీజేపీ ఒక్కటే అని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు అంజన్ కుమార్ అన్నా రు.జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బిజెపి జిల్లా పార్టీ కార్యాలయం డీకే బంగ్లాలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో సంఘటన సంరచన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్య క్రమానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు అంజన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా టి.అంజన్ కుమార్ మాట్లాడుతూఈనెల 15వ తేదీన బిజెపి పార్టీ అన్ని మండల కమిటీలు పూర్తి చేయాలన్నారు. ప్రతి మండల కమిటీలలో మహిళలు, ఎస్సీ,ఎస్టీలు ఎక్కువగా ఉండాలన్నారు. బిజెపి పార్టీలోకి స్వయం శక్తి గల మహిళలు ఎక్కువగా లీడర్షిప్ పెంపొందించాలన్నారు.ఎందుకంటే చట్టసభలో 33వశాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వంలో 50శాతం అవకాశం ఉంటుందన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలో 592 అన్ని పోలింగ్ బూతులలో అన్ని కమిటీలు పూర్తి చేయాలన్నారు.ఈ నెల 15వ తేదీ లోపు మండలంలోని బూతు కమిటీలు పూర్తి చేసి,శక్తి కేంద్ర కమిటీలు పూర్తి చేసి,శక్తి కేంద్ర కన్వీనర్లను నియా మించాలన్నారు. సంస్థాగత ఎన్నికల్లో మండల అధ్యక్షుల పాత్ర కీలకమని అత్యధిక సభ్యత్వం కలిగి ఉన్న పార్టీ బిజెపి పార్టీనే అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, జిల్లా ప్రభారీ విద్యా సాగర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు బండల వెంకట రాములు, అక్కల రమ సాయిబాబా, జయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే,అసెంబ్లీ కి పోటీ చేసిన అభ్యర్థులు బలిగేరాశివారెడ్డి, రాజగోపాల్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవా దాసు,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు అంజన్ కుమార్

## వడ్లు నిబంధనల ప్రకారం తూకం చేసి కొనుగోలు చేయాలి

- అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు

**వనపర్తి, మే 6 ప్రభాతవార్త:** వడ్లు తీసుకునేటప్పుడు తాలు, గడ్డి లేకుండా నిబంధనల ప్రకారం ఉన్నవి వెంటనే తూకం చేసి కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం కడుకుంట్ల, చిమనగుంటపల్లి వరి కొనుగోలు కేంద్రాలను, మదనపూర్ గోదాము, వెల్టూర్ వద్ద ఆగ్రోస్,దంతనూర్ లక్ష్మీనరసింహ రైస్ మిల్లులను తనిఖీ చేశారు. వరిలో తాలు లేకుండా చూడాలని, అదేవిధంగా పాత గన్ని బ్యాగులు కాకుండా కొత్త గన్ని బ్యాగులు వాడుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన వరిని మిల్లులకు త్వరగా తరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం అప్పరాల కృష్ణవేణి చక్కెర కర్మాగారంలో గోదాములో వరిధాన్యం నిల్వ చేయుటకు గల అవకాశాలను పరిశీలించారు. అనంతరం



వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ల తో సమావేశం నిర్వహించారు. ప్రతి సెంటర్‌కు లారీలు పెట్టాలని, ధాన్యం తరలింపులో లారీలసమస్య లేకుండా చూసుకోవాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. లేకుంటే కాంట్రాక్ట్ లైసెన్స్‌ని రద్దు చేస్తామని హెచ్చరించారు.

## ట్రాఫిక్ రూల్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**గద్వాల, మే6,ప్రభాతవార్త:** గద్వాల ట్రాఫిక్ రూల్స్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని గద్వాల్ ట్రాఫిక్ ఎస్ఐ బాల చంద్రుడు తెలియజేశారు. మంగళవారం గద్వాల్ రూరల్ పరిధిలో ట్రాఫిక్ ఎస్ఐ ఆధ్వర్యంలో ఆటోపై ట్రాఫిక్ సంబంధించి జాగ్రత్తలు తెలియజేసే స్టిక్కర్లను అతికించి,మైక్ ద్వారా ట్రాఫిక్ రూల్స్ పై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు మాట్లాడుతూ... ప్రజలకు రక్షణ కల్పించేందుకు ట్రాఫిక్ రూల్స్ అమలు చేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు క్షేమంగా గమ్యం చేరాలన్నదే పోలీసుల లక్ష్యమని ఆయన తెలియజేశారు. మద్యం తాగి వాహనాలు నడపరాదు పలు సూచనలు చేశారు. సెల్ఫోన్ మాట్లాడు తూ డ్రైవింగ్ అనర్థదాయకం అన్నారు.వేగం కన్నా ప్రాణం మిన్న అన్నారు. హెల్మెట్ ధరించి క్షేమంగా గమ్యం చేరండి అని ట్రాఫిక్ రూల్స్ వివరించారు. అలాగే ఆపద సమయంలో ఎమర్జెన్సీ నెంబర్లకు ఫోన్ చేసి సాయం పొందాలని సూచించారు.లైసెన్స్,ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని,ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలను నిలుపవద్దని, రోడ్డు పక్కనే ప్రయాణికులను దింపాలని సూచించారు.రోడ్డుప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను దగ్గరలోని ఆసుపత్రులకు తరలించాలని ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు పలు సూచనలు చేశారు.మద్యం సేవించి




ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై, సిబ్బంది

వాహనం నడపరాదని, తక్కువ దూరం ఉన్న రాంగ్ రూట్ లో ప్రయాణించవద్దని తెలిపారు. రోడ్డు మీద వెళుతున్నప్పుడు ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా డ్రైవింగ్ చేయాలన్నారు.అతివేగం ప్రమాదకరమని జాగ్రత్తగా వాహనాలు నడపలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ అన్నారు.ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు..లైసెన్సును రద్దు చేస్తామన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ..తాము క్షేమంగా ఉండడంతో పాటుఎదుటివారు కూడా క్షేమంగా ఉండే విధంగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ బింగిదొడ్డి దొడ్డెప్ప, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్

**అలంపూర్. మే6 ప్రభాతవార్త:** సాధారణ వరి ధాన్యానికి 2300 రూపాయలు వడ్ల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోగలరు నాణ్యమైన ఉత్పత్తికి అలంపూర్ మండలం సుల్తానాపురం గ్రామం వరి ధాన్యం పండించడంలో ఎంతో ప్రసిద్ధి గాంచింది అని అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ బింగిదొడ్డి దొడ్డెప్ప పేర్కొనడం జరిగింది. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం సుల్తానాపురం గ్రామంలో అధికారులతో కలిసి బుధవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగాఅలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ బింగిదొడ్డి దొడ్డెప్ప మాట్లాడుతూ రైతులు పండించిన పంటను స్వయంగా కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రం దగ్గర మధ్యవర్తులకు దళారులకు సంప్రదించకుండా నేరుగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రం దగ్గర ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని అలంపూర్ మార్కెట్



మార్కెట్ యార్డు చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

యార్డ్ చైర్మన్ బింగిదొడ్డి దొడ్డెప్ప తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో అల్లంపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అడ్డాకుల రాము,క్యాతూర్ చంద్రశేఖర్ రెడ్డి, సుల్తానాపురం మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ గౌడ్ ,లాల్ నాయుడు, రామాంజనేయులు, యూత్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ నరసింహ,వెంకటేష్, మహిళా సంఘాల వారు, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు పాల్గొనడం జరిగింది.

## రైతులు సాగు ఖర్చులు తగ్గించాలి

- జిల్లా వ్యవసాయాధికారి బొవ్వల వెంకటేష్

**భూత్పూర్,మే6,ప్రభాతవార్త:** రైతులు వ్యవసాయంలో సాధ్యమైనంతవరకు సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు పెంచేందుకు కృసిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి బొవ్వల వెంకటేష్ అన్నారు.మంగళవారం భూత్పూర్ మండలం వెల్కిచర్లలో పాలెం ప్రాంతీయ వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయి పరిశీలన గావించారు.శాస్త్రవేత్తలు గ్రామంలోని పంటపొలాలు, పంటలను సందర్శించారు.అనంతరంవెల్కిచర్లలో ఏర్పాటు చేసిన రైతు సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయాధికారి బొవ్వల వెంకటేష్ హాజరయ్యారు.ఈ



రైతు సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బొవ్వల వెంకటేష్



సదస్సుకు హాజరైన రైతులు,వ్యవసాయాధికారులు,ప్రజాప్రతినిధులు

సందర్భంగా వెంకటేష్ రైతుసదస్సుకు హాజరైన రైతలను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకంపై తమ దృష్టిని సారించాలని సూచించారు. సాగుకు సాధ్యమైనంతవరకు ఖర్చును తగ్గించి అధిక దిగుబడిని సాధించడం పట్లతమ దృష్టిని సారించాలని కోరారు. సాగులో నాణ్యమైన విత్తనాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. నకిలీ విత్తనాలుకొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో రైతులతో పాటు పాలెం ప్రాంతీయ వ్యవసాయ శాస్త్రవేత్తలు నీమాపర్వీన్, చరణ్‌తేజలతో పాటు భూత్పూర్ మండల వ్యవసాయాధికారి మురళీధర్,మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసులుతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

- బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ

**వనపర్తి రూరల్, మే 6 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ పేర్కొన్నారు. మంగళవారం మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా ఒకటవ వార్డులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వనపర్తి పట్టణ శాఖ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరవేయాలని అన్నారు. వార్డులలోనీ సీనియర్ నాయకులను కలుపుకొని వార్డులలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లోక్‌నాథ్ రెడ్డి,



కాలనీవాసులతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బిజెపి నాయకులు

రామన్ గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి, ఏ. సీతారాములు, అలివేలమ్మ, కొమ్ము శ్రీను కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



కొప్పునూరులో రిపేరుకు నోచుకోని చెత్త రిక్షాలు

## తుప్పు పట్టిన పారిశుద్ధ్య రిక్షాలు

■ పారుశుద్ధ్యానికి పనికి రాని చెత్త తరలించే రిక్షాలు..

■ నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కొప్పునూరులో రిక్షాలు

**చిన్నంబావి, మే 6 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో గత ప్రభుత్వం పారిశుద్ధ్య పనుల కోసం గ్రామాలలో చెత్తను సేకరించే రిక్షాలను పంపిణీ చేసింది. వాటిని కొంతకాలం ఉపయోగించి వాడుకోవడం జరిగింది. చిన్న చిన్న మైనర్ రిపేర్లకు నోచుకోకపోవడంతో ఎండనక, వాననక ఆరుబయట తడిచి ఎండుతూ నానుతూ ఆ పారిశుద్ధ రిక్షాలు పారిశుద్ధంలో కలిసిపోయాయి. వాటిని అధికారులు కానీ, పాలకులు కానీ పట్టించుకొని వాడుకలోకి తీసుకురాకపోవడంతో రోజురోజు తుప్పు పట్టి మళ్ళీ పారిశుద్ధ్య చెత్తగా తయారవుతుంది. ఇలా గ్రామాలలో చేత్త సేకరించాల్సినరిక్షాలన్ని నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నాయి. ఏది ఏమైనా గ్రామపంచాయతీ అధికారులు రిక్షాలను పట్టించుకొని గ్రామాలలో పరిశుభ్రంగా కొనసాగించాల్సిన బాధ్యత ఉందన్న విషయం మర్చిపోతున్నారని ప్రజలు భావిస్తున్నారు.



కొప్పునూరులో రిపేరుకు నోచుకోని చెత్త రిక్షాలు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

## పాకిస్తానీలను పంపివేయాలి : బిజెపి

**న్యాల్‌కల్, మే 6, ప్రభాతవార్త:** మండలంలో పాకిస్తానీలు, ఉగ్రవాదులు అక్రమంగా నివాసం ఉంటే పంపివేయాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మల్లేశ్ గంగ్వార్ పేర్కొన్నారు. మంగళవారం న్యాల్‌కల్‌లోని రెవెన్యూ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా మల్లేశ్ గంగ్వార్ మాట్లాడుతూ న్యాల్ కల్ మండలం కర్నాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉన్నందున ప్రతి గ్రామం లో తనిఖీలు చేసి పాకిస్తానీలు అక్రమంగా నివాసం ఉంటే గుర్తించి భారత దేశం నుంచి తరమికొట్టాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో కొత్తవారు, అను మానస్థులు ఉంటే రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు మల్లేశ్ గంగ్వార్ సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఓంకార్ యాదవ్, రాహుల్ పాలీంకార్, బిజిలిపూర్ నవీన్‌కుమార్, శ్రీకాంత్‌ముది రాజ్, ఓనంరెడ్డి, లక్ష్మారెడ్డి, మహేష్, వీరన్న, బిజెవైఎం మండల అధ్య క్షుడు సునార్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

**సదాశివపేట, మే 6, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయ వం తం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని కార్యాలయంలో సమ్మె గోడపత్రికను మల్లేశం ఆవిష్కరించి ప్రసంగించారు. సదాశివపేట ప్రాంతంలోని కార్మికులు సమ్మె లో పాల్గొని సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వి.ప్రవీణ్‌కుమార్, నాయకులు మల్లేశం, శ్రీనివాస్, సత్యనారాయణ, మోహన్‌చారి, రవి, పాండురంగం, శ్రీనివాస్‌గౌడ్, ప్రసాద్, రవికుమార్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్‌లో రైతు ముగింట్లోకి శాస్త్రవేత్తలు



రైతులకు పంటలసాగుపై అవగాహనకల్పిస్తున్న శాస్త్రవేత్త విజయకుమార్

**సదాశివపేట, మే 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆత్మకూర్‌లో మంగళవారం శాస్త్రవేత్తలు రైతు ముంగిట్లోకి చేరుకుని వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైతులు సాగు చేసు కుంటున్న చెరుకు, వరి పత్తి తదితర పంటలు అధిక దిగుబడి సాధిం చేందుకు బసంత్‌పూర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్, శాస్త్రవేత్త విజయలక్ష్మి, ఏడిఏ వెంకటలక్ష్మి, గణపతి చెక్కర కర్మాగార కేన్ జనరల్ మేనేజర్ కృష్ణమోహన్, మండల వ్యవసాయ అధికారి రమేష్ రైతుల చెంతకు చేరుకుని వ్యవసాయంలో పాటించాల్సిన యాజమాన్య పద్దతులపై వివరించారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడీల రామ్‌రెడ్డి, ఆత్మకూర్ క్లస్టర్ ఏఈఓ శ్రీదేవి, ఆత్మకూర్ మాజీ సర్పంచ్ గంగన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యూసుఫ్, రైతులు పాల్గొన్నారు.

**నల్లవల్లి గ్రామంలో...**



మాట్లాడుతున్న రాముల నాయక్

**గుమ్మడిదల మే 6(ప్రభాతవార్త) :** మండల పరిధిలో నల్లవల్లి గ్రామంలో అన్నారం పురపాలక వార్డు కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవ సాయ విశ్వ విద్యాలయం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభావత్ రాములునాయక్ (తెలంగాణా వ్యవసాయ కమిషన్ మెంబర్) ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా, కె.సుమాలిని మాట్లాడుతూ యూరియా వాడకం తగ్గించడంవల్ల సాగు ఖర్చు తగ్గించుకోవచ్చుని, అలాగే రసాయనాలను తగ్గించడం వల్ల నెల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చుని, పంట మార్పిడి చేయడం వలన చీడపీడలను తగ్గించవచ్చుని, పంట విత్తినప్పటి నుంచి పంట కోసేవరకు విత్తనాలకు సంబందించిన రశీదులు భద్రపరచుకోవాలి అని తెలిపారు. వ్యవసాయ విశ్వ విద్యాలయం వారి మేలైన వంగడాల గురించి వివరించారు. నత్నాయిపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా, శోభరాణి మాట్లా డుతూ వారి వ్యవసాయ క్షేత్రంలో సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పచ్చిరొట్టఎరువుల పంటలైన జనుము జీలుగ అవశ్యకతను విశదీకరిం చారు. ఎన్ మనోహర (వ్యవసాయ సహా సంచాలకులు పటాన్ చెరువు వ్యవసాయ డివిజన్) మాట్లాడుతూ వరి పంటల సాగులో వేదజల్లే పద్ధతి గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి రాములు నాయక్ పాల్గొని మాట్లాడుతూ పంట మార్పిడి చిరుధాన్యాలు సాగుచేయడం ద్వారా నేల మానవ ఆరోగ్యాన్ని పెంపొందవచ్చుని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఎన్ విష్ణువర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీ దయాకర్ రెడ్డి, డైరెక్టర్ జయశంకర్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ హేమలతజానకి, ఏఈఓ నిఖిత, ప్రణవి, టీచింగ్ అసోసియేట్ స్రవంత వ్యవసాయ విదార్థులు రైతులు పాల్గొన్నారు.

## నేటి నుంచి గడిపెద్దాపూర్‌లో మల్లన్న జాతర

**అల్లాదుర్గం, మే 6, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని గడిపెద్దాపూర్‌లో ఈ నెల 7వ తారీఖు నుంచి 14వ తేదీ వరకు శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి బాధ్యులు పేర్కొన్నారు. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఈ నెల 7న సున్నం వేయుల, 10న ఆలయం వద్ద కడప కడుగుట, 11న రేణుకమాత ఆలయం చుట్టూరా బోనాలు ప్రదక్షిణ, 12న మల్లికార్జున స్వామి, రేణుకమాత దేవాలయాల చుట్టూ జాతర బండ్ల ప్రదక్షిణ, 13న ఉదయం రేణుక మాత ఆలయం వద్ద రాత్రి 9 గంటలకు లంకా దహనం, 14న ఉదయం రేణుక మాత, మల్లికార్జునస్వామి ఆలయాల చుట్టూరా జాతర పాచి బండ్ల ప్రదక్షిణ కార్యక్రమాలు నిర్వహిసా రన్నారు. జాతర ఉత్సవాలకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల భక్తులు చేరుకుని స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకుని పునీతులు కావాలని ఆలయ కమిటి బాధ్యులు పేర్కొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన వ్యవసాయాధికారి

**నిజాంపేట, మే 6, ప్రభాతవార్త :** మండల పరిధిలోగల కల్వకుంట, నార్లాపూర్ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాలను మంగళవారం రోజున మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి సందర్శించారు. ఈ సంద ర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆకస్మిక వర్షం సూచన ఉన్నందున రైతులు ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తేమశాతం లేకుండా ఉండాలని నిర్వాహకులకు వరి కొనుగోలును వేగ వంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట సొసైటీ సీఈఓ గోపాల్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

# మయూరినగర్‌లో బస్తీ దర్శన్

**రామచంద్రాపురం, మే 6, ప్రభాతవార్త:**

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మయూరి నగర్‌లో మంగళవారం మార్నింగ్ వాక్ విత్ ఆఫీషి యల్స్ (బస్తీ దర్శన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ డిప్యూటీ కమిషనర్ సురేష్, ఎంఎంటిహెచ్ విజయ్ మోహన్, ఎస్ఎఫ్ పవన్, జిహెచ్ఎంసి శానిటేషన్, విద్యుత్, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొ రేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటి సభ్యులు పుష్పనగేష్ మాట్లాడుతూ కాలనీలో విద్యుత్ స్థం భాల సమస్య, సానిటేషన్ సమస్యలు ఉన్నట్లు గుర్తించామన్నారు. చెత్తను సేకరిస్తున్న వాహనదా రులు చెత్తను ఎక్కడ పడితే అక్కడే పారేస్తున్నారని కాలనీ అధ్యక్షులు మాధవరెడ్డి పేర్కొనడంతో చెత్తను రోడ్డుపై, రోడ్డు పక్కలో వేస్తే చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి డిసి, ఎంఎంటిహెచ్‌లకు సూచించారు సొసైటీ కార్యాలయం ముందున్న డ్రైనేజి రెండు రోజులకోమారు పొంగిబొర్లుతోందని కాలనీ వాసులు బస్తీ దర్శన్ దృష్టికి తేగా మ్యాన్ హోల్స్ శుభ్రం చేయించి లైన్ క్లియర్ అయ్యేలా చూడాలని జల మండలి అధికారులకు ఫోన్‌ద్వార ఆదేశించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్‌లు కావాలని కాలనీ వాసులు కోరగా త్వరలో నూతన ప్రతిపాదనలు తయారు చేయించి సమస్యలను పరిష్కరిస్తామని కార్పోరేటర్ కాలనీ వాసులకు హామి చేశారు. ఈ సందర్భంగా కాలనీలో సొసైటీ స్థలంలో రూమ్ నిర్మాణానికి కార్పొరేటర్ భూమి పూజలు నిర్వహిం చారు. కార్యక్రమంలో రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరామ్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, కృష్ణ, చక్రవర్తి, రమేష్, వేణుగోపాల్, శ్రీధర్‌రెడ్డి, సత్య నారాయణ, రాజేశ్వర్ పందిరి అంజయ్య పాల్గొన్నారు.





మయూరినగర్ బస్తీదర్శన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

## నేడు బస్వాపూర్‌లో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

**పుల్‌కల్, మే 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బస్వాపూర్‌లో ఈ నెల 7న రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు న్యాల్‌కల్ మండలంలోని బసంత్‌పూర్ గ్రామంలోని వ్యవ సాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్ నేతృత్వం లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్దతులపై వివరిస్తారన్నారు. కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పంటల అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పొందాలని ఏఒ మండల రైతులకు సూచించారు.

## క్యూఆర్ కోడ్‌లతో జర జాగ్రత్త : ఎస్ఐ వెంకట్‌రెడ్డి

**సిర్గాపూర్, మే 6, ప్రభాతవార్త:** సైబర్ మోసాల బారిన పడకుండా ప్రతి వ్యక్తి తగు జాగ్రత్తలు పాటించాల్సిన అసవరం ఉందని ఎస్ఐ వెంకట్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం ఎస్ఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే తరుణంలోఒకసారి ఆలోచించాలన్నారు. గిఫ్ట్ కార్డులు, డిసౌంట్ల కోసం, వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులలో క్యూఆర్ కోడ్ ఆన్‌చేస్తే మీ ఫోన్ హ్యాక్ అయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయని గుర్తు చేశారు. తమ వ్యక్తి గత సమాచారం చోరికి గురయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. అత్యాశకు పోయి మోసాలకు గురికావద్దని హితువు పలికారు.

**పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి...**

వేసవి సెలవు రోజులు కొనసాగుతున్నందున చిన్నారులపూ తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఎస్ఐ వెంకట్‌రెడ్డి సూచించారు. తమ చిన్నారులు సోషల్ మీడియాకు బానిన కాకుండా బ్రౌజరనచెక్ చేయాలన్నారు. చిన్నారుల ఆడే ఆన్ లైన్ గేమ్‌లు, స్క్రీన్ టైం తగ్గించాలన్నారు. స్క్రీన్ టైం ఎక్కువగా ఉండటంతో అనారోగ్యాల బారిన పడతారన్నారు. ఆన్‌లైన్ గేమ్ ఆడటంతో సైబర్‌నేరాలకు గురయ్యే అవకాశాలు ఉంటాయని గుర్తు చేశారు.

## పాకిస్తాన్ జాతీయులను తరమికొట్టాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న బిజెపి నేతలు

**రామచంద్రాపురం, మే 6, ప్రభాతవార్త:** మండలంలో పాకిస్తాన్ జాతీయు లను తరమికొట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భారతీయ జనతా పార్టీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు బి రాంబాబుగౌడ్, శంషాబాద్ రాజు, దేవేందర్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, వీరారెడ్డి, మాణిక్‌రెడ్డి, ప్రవీణ్ యాదవ్, బొజ్జ సుధీర్, సాయిప్రసాద్‌రెడ్డి, నర్సిములు, వేణుమాధవరెడ్డి, రాజిరెడ్డి ఉన్నారు.

## పాకిస్తాన్, బంగ్లాదేశీయులను తరిమేయాలి

**రామాయంపేట మున్సిపాలిటీ, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** భారతదేశంలో అక్రమంగా ఉంటున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ రోహింగ్యాలను వారి వారి దేశాలకు పంపించేయాలని బిజెపి నాయకులు విన్నవించారు. మంగళవారం నాదురామాయంపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో కాశ్మీర్ సరిహద్దులో ఉన్న పహల్గంలో జరిగిన మారణకాండ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న రోహింగ్యాలు, బంగ్లాదేశ్, పాకిస్థాన్ వారిని వారి దేశాలకు పంపించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు మండల తహశీల్దార్ రజనీకుమారికి, పట్టణ రెండవ ఎస్సై మల్లికార్జున్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఉన్న రోహింగ్యాలను పంపించేస్తున్నారని, వీరి పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. తక్షణమే వారి దేశాలకు వారిని పంపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. శ్రీనివాస్, పట్టణ బిజెపి నాయకులు వెలుముల సిద్ధరాములు, శంకర్ గౌడ్, రంగయ్య, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు మెమోరాండం ఇస్తున్న బిజెపి నాయకులు



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**చౌటకూరు, మే 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-12 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో విద్య ను అందుకున్న విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యను పూర్తి చేసుకుని ఆయా రంగాల్లో స్థిరపడ్డ స్నేహితులు ఒకచోట కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఉల్లాసంగా రోజును గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు కార్యక్రమానికి ఆహ్వానించి శాలువా, పూలమాలలతో సన్మానించి జ్ఞాపికలను అందచేసి ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు జ్ఞానోబ, సంగమేశ్వర్, హరిశ్రీ కృష్ణ, ఖదీర్ మాధవరెడ్డి, మురళీధర్‌రెడ్డి, లింగమయ్య, పూర్వ విద్యార్థులు శివగొండ, మల్లేశం, సురేష్, వంశీ, సాయి క్రిష్ణ, చక్రపాణి, ప్రభాకర్, సాయికుమార్, కురుణాకర్, శ్రీకాంత్, వినోద్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ విఫలమైన మేనిఫెస్టోను

### గడపగడపకు తీసుకెళ్లండి : మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

**పాపన్నపేట, మే 6, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోను అమలు పరచడంలో ప్రభుత్వం విఫలమైన విషయాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు గడపగడపకు తీసుకవెళ్లాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటినుండే పార్టీ నాయకులు కార్యకర్తలు తమ తమ గ్రామాల్లో కార్యాచరణ రూపొందించుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చినటువంటి ప్రధాన హామీలలో పెన్షన్లు అన్ని రకాల పెన్షను 2000 రూపాయల నుంచి 4000 రూపాయలు వరకు పెంచడం, అదేవిధంగా కళ్యాణలక్ష్మి పథకంలో అదనం గా తులం బంగారం ఇవ్వడం ,మరీ ముఖ్యంగా రైతులకు రైతుబంధు గాని రైతు భరోసా గాని సంవత్సరానికి ఎకరానికి 15 వేల రూపాయలు హామీ, మరియు చదువుకున్న ప్రతి మహిళలకు స్కూటీలను ఉచితంగా ఇవ్వడం సౌభాగ్యలక్ష్మి అనే పథకంలో ప్రతి మహిళలకు నెలకు 2500 ఇవ్వడం వీట న్నిటిని ప్రతి గడపగడపకు వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. అధికారం చేపట్టి సుమారు 16 నెలలు గడుస్తున్న అమలు చేయకుండా పథకాల నియమ నిబంధనలు మార్చుకుంటూ , కాలయాపన చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో వీటిని ప్రజలను వివరించి ప్రజలకు తెలియజేసి వారందరినీ కూడా బిఆర్ఎస్ పార్టీ వైపుకు మళ్ళించే దిశగా కార్యకర్తలు . నాయకులు కృషి చేయవలసిందిగా మరీ ముఖ్యంగా కొత్త ఓటర్ నమోదు కార్యక్రమంలో కూడా మీరందరూ కూడా చురుకుగా పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

## నేత్రపర్వంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

**జహీరాబాద్ (కోహీర్), మే 6, ప్రభాతవార్త:** కోహీర్ మండలం చింతల్ ఘాట్‌లో మంగళవారం శ్రీదుర్గామాత, ఉరదమ్మ మాతల విగ్రహాల ప్రతిష్ఠా పన కార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ఠాపన కార్య క్రమానికి రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయ కులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి పాల్గొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వ హించగా నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ ముబీన్, కోహీర్, జహీరాబాద్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాంలింగారెడ్డి, నర్సింహారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు మల్లన్న పాటిల్, అశ్విన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



చింతల్‌ఘట్‌లో విగ్రహాల ప్రతిష్ఠాపనలో పాల్గొన్న సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

# పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి

## పిఆర్‌టియు టిఎస్ నేతలు

**మెదక్ అర్బన్, మే 6, ప్రభాతవార్త:** ఉద్యోగ ఉపాధ్యాయుల, విశ్రాంత ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని పిఆర్‌టియు టిఎస్ మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుంకరి కృష్ణ, సామ్యనాయక్ మంగళవారం మెదక్‌లో మాట్లాడుతూ 5 డిఏలను వెంటనే విడుదల చేయా లని, సిపిఎస్ విధానం రద్దుచేసి, ఓపీఎస్ విధానం అమలుపరచాలని, జీవో నెంబర్ 317 బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సోమవారం విలేకరుల సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకుల గురించి మాట్లాడుతూ వారు చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. సబ్ కమిటీతో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో వెంటనే చర్చలు జరపాలని, నెలకు 500 కోట్లు ఉద్యోగ ఉపాధ్యాయుల, విశ్రాంత ఉపాధ్యాయులకు సంబం ధించి బకాయిలు విడుదల చేస్తామని ప్రకటించిన ఇంతవరకు ఒక్క రూపాయివిడుదల చేయకపోవడం సమంజసం కాదని వాపోయారు. రెండు సంవత్స రాల నుండి ఉద్యోగ ఉపాధ్యాయుడు దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు కూడా విడుదల చేయకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అడ గడం తప్పా అని వారు ప్రశ్నించారు. ఎన్నికల హామీల భాగంగానే స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన డీఏలను విడుదల చేయకపోవడాన్ని వారు తప్పుపట్టారు. వెంటనే ఉద్యోగ ఉపాధ్యా యుల, విశ్రాంత ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, దీర్ఘకాలికంగా ఉన్న సమస్య లను పరిష్కరించకపోతే ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతా మని మంగళవారం మెదక్‌లో ఒక ప్రకటనలలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్.మల్లారెడ్డి, మెదక్ పట్టణ, పరిసర ప్రాంతాల బాధ్యులు శిరేగే చంద్ర శేఖర్, ఇమ్మడి సంతోష్‌కుమార్, వీరేశం, నరేందర్ రెడ్డి, ఎగొండ, హరిబాబు, పంతులు రాజు, సుభాష్ రెడ్డి, సురేష్, యాదవరెడ్డి, మార్గం సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఆర్‌టియుటీఎస్ నేతలు

## కొనుగోలు కేంద్రంలో అధికారుల చేతివాటం

### -తరుగు పేరుతో అన్నదాతలకు కుచ్చుటోపి

**మనూర్, మే 6, ప్రభాతవార్త:** రైతులకు మద్దతు ధరను అందిస్తూ ఆసరాగా ఉంటుందనుకుంట్ను జొన్నల కొనుగోలు కేంద్రంలో అధికారుల చేతివాటంతో అన్నదాతలు ఆగమాగమవుతున్నారు. మనూర్‌తోపాటు ఆయా గ్రామాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ ఏర్పాటు చేసింది. మనూర్‌లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రానికి తర లించిన జొన్నల నుంచి 50 కిలోల బస్తా వద్ద 1 కిలో తరుగు తీయాల్సి ఉండగా కొనుగోలు కేంద్రం అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ 50 కిలోల బస్తా వద్ద ఏకంగా 4 నుంచి 5 కిలోల తరుగును తీస్తున్నారని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పుండు మీద కారం చల్లిన చందంగా 4 నుంచి 5 కిలోల తరుగును తీయడంతో పాటు జొన్నలను తూకం చేసే తరుణంలో తమచాతుర్యాన్ని ప్రదర్శిస్తూ బస్తా నుంచి 1 కిలో వరకు జొన్నలు నేలపాలయ్యేలా చేస్తుండటంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కొనుగోలు కేంద్రానికి తరలించిన క్వింటాలు జొన్నలకు రూ. 3371 వస్తాయని ఆశిం చిన రైతులకు అయిదారు కిలోలు తరుగు, చల్లిపోవడం రూపంలో తగ్గడం ఒకవైపు కాగా మరోవైపు క్వింటాలు జొన్నలకు రూ. 80 హమాలీ ఖర్చు లనువసూలు చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతు న్నారు. ఆరుగాలం కష్టించి పంటలను పండిస్తున్న అన్నదాతల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు స్పందించి కిలోకు మించి తరుగు తీయకుండా, జొన్నలు ఒలికిపోకుండా, హమాలీ చార్జీలు ప్రభు త్వమే భరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు వినతి చేస్తున్నారు.

## మోడల్ విద్యాసంస్థల్లో ప్రారంభమైన అడ్మిషన్లు

**పుల్‌కల్, మే 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బస్వాపూర్‌లోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశా నికి అడ్మిషన్‌ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ పివి కళ్యాణచక్రవర్తి పేర్కొన్నారు. మే 20వ తేదీవరకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవచ్చ న్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఈ నెల 26న నోటీసు బోర్డులో పెడతామని చెప్పారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు సర్టిఫికెట్‌ల ధృవీకరణ, ప్రవేశ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఎస్ఎస్‌సిలో పొందిన మెరిట్ ఆధారంగా, రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం కొనసా గుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత నోటు బుక్స్, ఈపాసెట్, నీట్‌లకు కోచింగ్, కేరీర్ కౌన్సెలింగ్, బాలికలకు వసతిగృహం సౌకర్యం, ఆపేరల్, ఆగ్రికల్చర్ లో వృత్తిపరమైన కోర్సులు అదనంగా అందుకుంటారన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

## అభివృద్ధికి కేంద్రం ఆర్థిక సహాయం అందించాలి

### -టిపిసిసి ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ భీంరావునాయక్

**సిర్గాపూర్, మే 6, ప్రభాతవార్త:** వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాల్సి ఉంటుందని టిపిసిసి ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ భీంరావునాయక్ అన్నారు. మంగళవారం భీంరావునాయక్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న 19 రాష్ట్రాలలో అమలుకాని సంక్షేమ పథకాలు ఒక్క తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్నా యని గుర్తుచేశారు. తెలంగాణ వాస్తవ విషయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడితే ఎంపి బండి సంజయ్ తెలంగాణ పరువును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీస్తున్నారని మాట్లాడటం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా గుండు సున్నా పెట్టినప్పుడు 4 కోట్ల ప్రజల ఆత్మ గౌరవ గురించి బండి సంజయ్ మాట్లాడితే బాగుండేదని చురకలంటించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 7 కోట్ల రూపాయలు అప్పు చేసినప్పుడు బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న బండి సంజయ్ ఏ ఒక్క రోజు నోరు మెదపలేదని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, రైతులకు రుణమాఫీ, రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతిపై 500 రూపాయల మాఫీ, వరి ధాన్యంపై 500 రూపాయల బోనస్‌ల గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదికి చెప్పాలని బండి సంజయ్‌కు భీంరావు నాయక్ సూచించారు.

## మల్లికార్జున స్వామి ఆలయంలో మాధవానంద స్వామి పూజలు

**సదాశివపేట, మే 6, ప్రభాతవార్త:** పట్టణంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని మంగళవారం తొగుట పీఠాధిపతి మాధవా నంద సరస్వతిస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆల యానికి చేరుకున్న మాధవానంద సరస్వతి స్వామిని 1983-84 విద్యా సంవత్సరంలో 10వ తరగతిని పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆధ్వ ర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించి మాధవానంద సరస్వతిస్వామిని దర్శించు కుని ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో మనోహరశర్మ, నారాయణ రావు పంతులు, సత్యనారాయణ కులకర్ణి, ఆయ్యప్ప పంతులు ఉన్నారు.

## ఐకెపి కేంద్రాలను డిపిఎం ఆకస్మిక తనిఖీ

**గుమ్మడిదల మే 6(ప్రభాతవార్త) :** మండలంలోని ఐకెపి సెంటర్లను మంగళవారం జిల్లా అధికారి తనిఖీలు నిర్వహించారు. కొత్తపల్లి, కాను కుంట ఐకెపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డిఆర్‌డిఏ డిపిఎం జయశ్రీ ఆకస్మిక తనిఖీ చేసి రికార్డ్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొత్త పల్లి గ్రామంలో 26 రైతుల వద్ద2460 బస్తాలు984.80 క్వింటాళ్ళు, కొనుగోలు చేయడం జరిగిందని అలాగే కానుకుంటలో 24 రైతుల వద్ద 2106 బస్తాలు842.80 క్వింటాలు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అకాల వర్షం కారణంగా ధాన్యం తడవకుండా ఉండేదుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు సాధ్యమైనంత వరకు పంటను త్వరగా మిల్లులకు చేర్చే విధంగా చూడాలని దానికి అధికారుల సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం రైతులకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ లను పంపిణీ ఈ కార్యక్రమంలో ఏపిఎం శివకుమార్, సీసీ కృష్ణ, సీసీ మేహర్ ఉన్నిసా, బి ఓ ఏ కల్పన, కేంద్రం నిర్వాహకులు అఖిల, శోభ, పద్మ , కానుకుంట కొత్తపల్లి రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి జయశ్రీ

## ఉజలంపాడ్‌లో ట్రాలీ చోరీ

**సిర్గాపూర్, మే 6, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తులు ట్రాలీని చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని ఉజలంపాడ్ గ్రామ శివారలో శనివా రం సాయంత్రం జరిగింది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం... ఉజలం పాడ్ గ్రామ శివారులో రూప్లానాయక్ తండా పరిధిలోని జొన్న చేనులో జాదవ్ పర్‌లాల్ శనివారం సాయంత్రం ట్రాక్టర్ ట్రాలీని పెట్టి ఇంటికి వెళ్లి రాత్రికి 9 గంటలకు వచ్చే సరికి ట్రాలీ కానరాలేదన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సిసి టీవిలో ట్రాలీని తీసుకుపోతున్న దృశ్యాలు నిక్షిప్తమయ్యాయని, ట్రాలీని గుర్తిస్తే పోలీసులు సమాచారం అందించాలని ఎస్ఐ వివరించారు.

## విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

**సిర్గాపూర్, మే 6, ప్రభాతవార్త:** విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అంతర్గాం గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాలాజీరావు ఆవును రోజుమాదిరిగానే మేతకు తీసుకెళుతుండగా మాలిపాటిల్ రాజేందర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలకు తాకి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఐదేళ్ల వయసుగల ఆవు విలువ రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు బాలాజీరావు వినతి చేస్తున్నారు.

